## క్లుప్తంగా

### సమాచారం

➤ రేపు కలెక్టరేట్‌లో టెస్కోస్టాల్ ఏర్పాటు

ఖమ్మంగాంధీచౌక్: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈనెల 7న(గురువారం)ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో టెస్కోస్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చేనేత డివిజనల్ మార్కెటింగ్ మేనేజర్ బొట్టు వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విక్రయాల్లో అన్ని రకాల వస్త్రాలపై 30 శాతం, రాజ్‌కోట్ ఇక్కత్ సిల్క్ చీరలపై 40 శాతం, ఎంపిక చేసిన వస్త్రాలపై 50 శాతం, ప్రత్యేక తగ్గింపు ఉంటుందని తెలిపారు. చేనేత కార్మికులకు పని కల్పించి, చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలని ఆయన కోరారు.

➤ నేడు 'ఉపాధి' పనులపై ప్రజా వేదిక

నేలకొండపల్లి: గతేడాది ఏప్రిల్ 1, నుంచి మార్చి 2025 వరకు జరిగిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.యర్రయ్య తెలిపారు. మంగళవారం తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. కూలీలు, మేట్లు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో ఈజీఎస్ ఏపీఓ ఆర్.సునీత, ఈసీ శేష గిరిరావు పాల్గొన్నారు.

### క్యూబాకు ఆర్టీసీ కార్మికుల సంఘీభావ నిధి

ఖమ్మం మామిళ్లగూడెం: క్యూబా దేశంపై అమెరికాన్ ఆంక్షలను వ్యతిరేకిస్తూ క్యూబా సంఘీభావ నిధి సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం ఖమ్మం డిపో అధ్యక్షుడు గడ్డం వెంకటయ్య ఆధ్వర్యాన ఖమ్మం డిపో వద్ద ప్రారంభించారు. ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు గుండు మాధవరావు, మహిళా కన్వీనర్ సరిత, ఉపాధ్యక్షుడు వి.రమేష్, ఖమ్మం డిపో అధ్యక్షుడు గడ్డం వెంకటయ్య, ఉపాధ్యక్షులు బుగ్గవీటి లింగమూర్తి, కార్యదర్శి రోశయ్య, సహాయ కార్యదర్శి వి.సురేష్, మహిళా కన్వీనర్ రామలక్ష్మి, రాధిక, డీ.కే. మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### నియామకం

ఖమ్మం లీగల్ : చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదిగా నగరానికి చెందిన న్యాయవాది బిల్లా శ్రీనివాసరావు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్‌గా కండె వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. వీరి నియామకంపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వర్లు, వివిధ లీగల్ సంఘాలు, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

### సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంసహకారనగర్: రాష్ట్రంలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(టీఎస్‌పీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ షౌకత్ అలీ, ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.రోహిత్‌నాయక్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి విన్నవించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిసి పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు.

# సాఫీగా సాగక..

కామేపల్లి మండలంలోని కామేపల్లి, కొండాయిగూడెం, పాతలింగాల, పింజరమడుగు, మద్దులపల్లి పెద్ద చెరువుల సాగునీటి కాల్వలపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో పిచ్చి మొక్కలు పెరిగి పూడికతో నిండాయి. చెరువు నిండా నీరున్నా చివరి ఆయకట్టు పొలాలకు చేరలేని దుస్థితి నెలకొంది. ఫలితంగా ఆయకట్టు కింద చాలామంది రైతుల పంట పొలాలు బీడు భూములుగా మారుతున్నాయి. బావులు, బోర్ల కింద ఓ వైపు నాట్లు వేస్తుండగా.. చెరువు చివరి ఆయకట్టు పొలాల్లో సాగు పనులు ముందుకు సాగడం లేదు. – కామేపల్లి



పిచ్చి మొక్కలతో నిండిపోయిన కొండాయిగూడెం పంట కాల్వ

**కొండాయిగూడెం పెద్ద చెరువుపై అధికారుల చిన్నచూపు**

- పిచ్చి మొక్కలు, పూడికతో అధ్వానంగా కాల్వలు
- ఏళ్లుగా కరువైన మరమ్మతులు
- నీరందక బీడుభూములుగా మారుతున్న పంట పొలాలు

**1,000 ఎకరాలకు పైగా సాగు..**

మండలంలోనే కొండాయిగూడెం పెద్ద చెరువు అతి పెద్దది. ఈ చెరువు కింద 1,000 ఎకరాలకు పైగా ఆయకట్టు సాగవుతోంది. గతంలో ఒకసారి చెరువు నిండితే రెండు పంటలకు పుష్కలంగా సాగు నీరు అంది పచ్చని వరిపైరుతో కళకళలాడేవి. కానీ ఇప్పుడవి బీడు భూములుగా మారుతున్నాయి. కనీసం ఖరీఫ్ సీజన్‌లోనైనా చివరి ఆయకట్టు పొలాలకు కూడా నీరందే పరిస్థితి లేకుండాపోతోంది. ఓ పక్క చెరువు శిఖం ఆక్రమణకు గురికావడంతో నీటి నిల్వ తగ్గిపోగా, చెరువు పంట కాల్వలు సక్రమంగా లేక సాగు నీరు పారడంలేదని రైతులు వాపోతున్నారు. కనీసం కాల్వల పునరుద్ధరణ పనులు చేపట్టి పిచ్చి మొక్కలు, పూడికను తొలగించలేని పరిస్థితి దాపురించడంతో కొంతమంది రైతులు తమ సొంత ఖర్చులతో కాల్వలకు మరమ్మతులు చేయించుకుంటున్నారు. ఇలా మండలంలోని పెద్ద చెరువులన్నింటి పరిస్థితి ఇలాగే ఉంది.

**నీరంతా వృథా..**



బీడుభూములుగా మారిన పంటపొలాలు

చెరువు పంట కాల్వల ద్వారా నీటిని వదిలినప్పుడు పంట కాల్వలు అధ్వానంగా ఉండడంతో నీరు ముందుకు సాగక నీరంతా వృథాగా వాగులోకి చేరుతోంది. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యంగానే కనిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు కాల్వల పునరుద్ధరణ పనులు చేపట్టి పిచ్చి మొక్కలు, పూడిక తీయించి చివరి ఆయకట్టుకి సాగు నీరు అందించేలా చొరవ చూపాలని రైతులు వేడుకుంటున్నారు.

**సాగు నీరు అందడం లేదు..**



చెరువు చివరి ఆయకట్టు పొలాలకు సాగు నీరు అందడం లేదు. కాల్వల నిర్వహణ అధ్వానంగా ఉండడంతో పంటలను సకాలంలో సాగు చేయలేకపోతున్నాం. కొన్ని సందర్భాల్లో పొలాలు బీడుభూములుగా మారిన పరిస్థితి నెలకొంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండడం లేదు.

– బండి చిన్న సైదులు, రైతు, పింజరమడుగు

**అధికారులు స్పందించాలి..**



చెరువుల చివరి ఆయకట్టుకు సాగు నీరందేలా తగిన చర్యలు చేపట్టాలి. కొండాయిగూడెం పెద్ద చెరువు చివరి ఆయకట్టుకు నీరందక బావులపై ఆధారపడాల్సి వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో బావుల్లో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– జర్పుల బాల, రైతు, బండిపాడు

**మేమే బాగు చేసుకున్నాం..**



ప్రభుత్వం పంట కాల్వల పునరుద్దరణకు చర్యలు చేపట్టకపోవడంతో పొలాలకు సాగునీరు అందే పరిస్థితి లేదు. దీంతో రైతులందరం కలిసి సొంత ఖర్చులతో కాల్వలో పిచ్చి మొక్కలు, పూడికను తీయించుకున్నాం. చివరి ఆయకట్టు రైతులకు నీరు చేరాలంటే కష్టంగా మారింది.

– యలమద్ది అప్పారావు, కొండాయిగూడెం ఆయకట్టు మాజీ చైర్మన్

**చెరువుపై చిన్నచూపు..**

పెద్ద చెరువులపై మొదటి నుంచి అధికారులు చిన్నచూపు చూపిస్తున్నారు. చెరువు ఆక్రమణకు గురైనా, చెరువులో అక్రమంగా బావులు తీసినా, చెరువు నీటిని అక్రమంగా మోటార్ల ద్వారా తరలిస్తున్నా, రైతులు స్వయంగా ఫిర్యాదు చేసినా ఆ వైపు సంబంధింత అధికారులు కన్నెత్తి చూడడం లేదు. రైతులు చేసిన ఫిర్యాదులను చెత్తబుట్టలో పడేసి జిల్లా ఉన్నతాధికారులకు సైతం తప్పుడు సమాచారం అందించి అసలు సమస్యే లేన్నట్లుగా చెబుతున్నారు. దీంతో చెరువు కింద సాగు విస్తీర్ణం నానాటికి తగ్గిపోతున్న పరిస్థితి నెలకొంది.

## ప్రసవాల సంఖ్య పెంచాల్సిందే..



నేలకొండపల్లి: మాట్లాడుతున్న డీసీహెచ్‌ఓ రాజశేఖర్‌గౌడ్

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా వైద్యులు, ఉద్యోగులు కృషి చేయాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి(డీసీహెచ్‌ఓ) డాక్టర్ కె.రాజశేఖర్‌గౌడ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చందునాయక్ సూచించారు. నేలకొండపల్లి మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలతో మంగళవారం సమావేశమైన సందర్భంగా డీసీహెచ్‌ఓ, ఆశా డే సందర్భంగా తిరుమలాయపాలెంలో జరిగిన సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేలా వైద్యసేవలపై గర్భిణులకు అవగాహన కల్పించాలని, ప్రస్తుతం పీహెచ్‌సీ, సీహెచ్‌సీ విడిపోయినా రెండింటి వైద్యులు సమన్వయంతో పనిచేస్తూ లక్ష్యాలను చేరుకోవాలని డీసీహెచ్‌ఓ సూచించారు. అలాగే, సీజనల్ వ్యాధుల కట్టడిపై దృష్టి సారించాలని, డ్రైడే కార్యక్రమాలు చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఈ సమావేశాల్లో ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.మంగళ, వైద్యులు నాగమణి, ఎం.డీ.సన, అర్జున్ గౌతమ్, ఉద్యోగులు శాంతిరాణి, చంద్రశేఖర్, వీరన్న, కృపాఉషశ్రీ, అవినాష్, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాస్పత్రిలో మళ్లీ కార్మికుల సమ్మె



కార్మికులకు నచ్చచెబుతున్న సూపరింటెండెంట్

ఖమ్మంవైద్యవిభాగం: పెండింగ్ వేతనాల కోసం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి కార్మికులు మంగళవారం మళ్లీ నిరవధిక సమ్మెకు దిగారు. గతంలో పలుమార్లు సమ్మె చేయగా ఒకటి, రెండు నెలలు వేతనం చెల్లించి సర్దిచెప్పడం ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు మూడు నెలల వేతనాలు చెల్లించే వరకు విధుల్లోకి వచ్చేది లేదంటూ వారు ఎంసీహెచ్ ఆవరణలోని షెడ్డులో బైఠాయించారు. దీంతో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎం.నరేందర్ మాట్లాడుతూ రెండు రోజుల సమయం ఇస్తే వేతనాలు అందేలా చూస్తానని నచ్చచెప్పినా వారు ససేమిరా అన్నారు. కాగా, కార్మికుల సమ్మెతో ఆస్పత్రిలోని పలు వార్డుల్లో చెత్త పేరుకుపోగా, రోగులకు సాయం చేసే వారు లేక ఇబ్బంది పడ్డారు.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రఘునాథపాలెం: ఎన్నికల సమయాన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం బీకేఎంయూ ఆధ్వర్యాన తక్షణమే హామీలు అమలుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్వేతకు వినతిపత్రం సమర్పించాక మాట్లాడారు. ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి రూ.12వేలు, రూ.6 వేల వృద్ధాప్య పెన్షన్, అర్హులకు ఇళ్ల నిర్మాణం, కూలీల కుటుంబాలకు రూ.5 లక్షల ప్రమాద బీమా, నెలకు సరిపడా నిత్యావసరాల పంపిణీ తదితర హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో పని చేయకున్నా, వ్యవసాయ కార్మికులందరికీ ఆత్మీయ భరోసా వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బోడా చీనా, భూక్యా జామ్లా, ధరావత్ మంగ, ధరావత్ లాలు, ధరావత్ చిన్న, జర్పుల బీమా, ధరావత్ వాలీ, బానోత్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## 'బోడేపూడి' వర్ధంతి

ఖమ్మం మామిళ్లగూడెం: సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బోడేపూడి వెంకటేశ్వరరావు వర్ధంతి సభను మంగళవారం జిల్లా కార్యాలయం సుందరయ్య భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.సాయిబాబు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బోడేపూడి జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఆయన సేవలను కొనియాడారు. రాష్ట్ర కమిటీ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, బండి రమేష్, బండి పద్మ, యర్రా శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, సత్యనారాయణ, తిరుపతిరావు, రమ్య, రమణ, షేక్ బషీరుద్దీన్ పాల్గొన్నారు.

## గిరిజనుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టొద్దు

ఖమ్మం మామిళ్లగూడెం: గిరిజన తెగల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టొద్దని బంజారా అడ్వకేట్ జేఏసీ నాయకుడు హరినాయక్ పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని భద్రాచలం ఎమ్మెల్యేతో పాటు ఆదిలాబాద్ మాజీ ఎంపీ, మరికొంతమంది కలిసి సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. బంజారాలకు నామమాత్రపు పదవులిచ్చి అణగదొక్కే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. ఈ సమావేశంలో బంజారా సీనియర్ నాయకులు బానోత్ కిషన్, అడ్వకేట్ జేఏసీ నాయకులు ధరావత్ వీరన్న, ధరావత్ ప్రసాద్, జర్పుల బాలకృష్ణ, బానోత్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వరదలపై అప్రమత్తత అవసరం



అధికారులకు సూచనలు చేస్తున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్నేరు వరదల పట్ల అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అన్నారు. మంగళవారం నగరంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, పునరావాస కేంద్రాలను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్నేరు వరదను నిరంతరం పర్యవేక్షిస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పునరావాస కేంద్రాలకు తరలించే ముందే ఏ కేంద్రంలో ఎంత మందికి పునరావాసం కల్పించవచ్చనే లెక్కలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సత్వర సాయం కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు, హెల్ప్‌లైన్ నంబర్లను ప్రదర్శన, అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట డీఈలు, టీపీఎస్‌లు, వార్డు ఆఫీసర్లు ఉన్నారు.

**మల్లెమడుగు పాఠశాల సందర్శన..**

ఖమ్మం సహకారనగర్: నగరంలోని మల్లెమడుగు పాఠశాలను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించి నిర్దిష్ట విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి నిర్దిష్ట లక్ష్యంతో ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, పాఠశాల హెచ్‌ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలపై మంత్రి పొంగులేటికి వినతులు



తిరుమలాయపాలెం: మంత్రికి వినతి పత్రం ఇస్తున్న మాస్‌లైన్ నాయకులు

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: మండలాల్లో నెలకొన్న పలు సమస్యలపై రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. ఈనేపథ్యాన మంగళవారం తిరుమలాయపాలెంలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన మంత్రికి అఖిలపక్షం ఆధ్వర్యాన వినతిపత్రం అందించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో ఐటీఐ కళాశాలతో పాటు షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. అలాగే పిండిప్రోలు గ్రామానికి ఎక్కువ ఇళ్లు కేటాయించాలని కోరుతూ సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు వినతిపత్రం అందజేశారు. అంతేకాక మంత్రి పొంగులేటికి ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం మోటాపురం సొసైటీ మాజీ డైరెక్టర్ రావెళ్ల కృష్ణారావు వినతిపత్రం అందించారు. అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలని, స్థానిక పీహెచ్‌సీని తరలించకుండా మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడాలని కోరారు.

### చర్యలు తీసుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఎగ్జిక్యూటివ్ కమిటీకి సంబంధం లేని వ్యక్తిని సంస్థ ట్రెజరర్‌గా నియమించి ఐదేళ్లుగా మోసం చేస్తున్న ది గాడ్ థెరిస్సా మహిళా మండలి అధ్యక్షురాలిపై చర్యలు తీసుకోవాలని మహిళా మండలి సభ్యురాలు నాగరాణి, ఉమా డిమాండ్ చేశారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సంస్థలో జరుగుతున్న మోసాలపై తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీకి, జిల్లాలోని డీపీసీయూకి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఆమెకు సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంస్థ సభ్యులు పద్మ, రాణి, రమ, లక్ష్మి, సంజన తదితరులు పాల్గొన్నారు.

### కార్మికుల సమస్యలపై తహసీల్దార్‌కు వినతి

కూసుమంచి: వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన పెన్షన్, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి భూక్యా నర్సింహా, సహాయ కార్యదర్శి జిల్లా లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు నిరసన



ఖమ్మం మామిళ్లగూడెం: కరపత్రాలతో ప్రచారం చేస్తున్న సీపీఐ నాయకులు



ఖమ్మం సహకారనగర్: బ్యానర్లు, కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్/ రఘునాథపాలెం/ ఖమ్మంసహకారనగర్/ ఖమ్మంమామిళ్లగూడెం: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ నగరంలో వామపక్ష పార్టీలు, వివిధ సంఘాల ఆధ్వర్యాన మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్, అమెరికా దేశాల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఇజ్రాయిల్, అమెరికా కలిసి చేస్తున్న దాడులను ప్రపంచ మానవ హక్కుల సంస్థలు ఖండించాలని, దేశంలోని మేధావులు, విద్యార్థులు, యువత మానవతా వాద దృక్పథంతో స్పందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆగస్టు 7న ఖమ్మంలో నిర్వహించనున్న గాజా సంఘీభావ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ నేపథ్యాన ఖమ్మంరూరల్ మండలం ఎంవెంకటాయపాలెంలో జరిగిన సమావేశంలో మాస్‌లైన్ పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య, రఘునాథపాలెంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రఘునాథపాలెం మండల కార్యదర్శి కేలోతు లక్ష్మణ్ , నగరంలోని కృషిభవన్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్, తెలంగాణ(ఎస్‌జీపీటీఏ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్, రైతుబజార్, కాంగ్రెస్ ఆఫీస్‌సెంటర్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యానాల సాంబశివరెడ్డి, నాయకుడు మోహమ్మద్ సలాం మాట్లాడారు. అనంతరం ర్యాలీకి సంబంధించిన కరపత్రాలు, బ్యానర్లు, పోస్టర్లను ఆవిష్కరించారు. కాగా, పాలస్తీనా సంఘీభావ యాత్రకు ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొనాలని ప్రైవేటు విద్యాసంస్థల బాధ్యులు మువ్వా శ్రీనివాసరావు, గుర్రం కాంతారావు, కె.వీరారెడ్డి, మతీన్, శేషగిరి, నవీన్‌లు కోరారు. ఈకార్యక్రమాల్లో నాయకులు ధరావత్ లక్ష్మణ్, జాటోత్ ప్రేమ్‌సింగ్, ఇస్లావత్ రమేష్, మహమ్మద్ సలాం, సాంబశివరెడ్డి, జ్వాలా నరసింహారావు, ఎస్‌కె.చానా, పెన్షనర్లు దుగ్గినేని శ్రీనివాసరావు, పి. కోటేశ్వరరావు,తాతా రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్పీడ్‌కు ఇక బ్రేక్..

నగరంలోని త్రీటౌన్‌లో రాజేంద్రనగర్ ఉన్నత పాఠశాల, హర్కారా బావి సెంటర్‌లోని క్రియేటివ్ స్కూల్ వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలల మార్గాల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, ఇతర వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రమాదకరంగా మారింది. దీంతో స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. ఆ పాఠశాలల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు.

– ఖమ్మంగాంధీచౌక్



హర్కారా బావి సెంటర్‌లో క్రియేటివ్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్

## గోశాలకు విరాళాల వెల్లువ



ఆర్థిక సాయం అందిస్తున్న దాత

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెం ఓం శ్రీ కృష్ణ గోశాలకు పలువురు దాతలు మంగళవారం విరాళాలు అందజేశారు. ఎం.అప్పయ్య జ్ఞాపకార్థం ఆయన సతీమణి గోవిందమ్మ రూ.12,116, తాటి నాగార్జున్ రూ.2వేలు విరాళంగా అందించినట్లు గోశాల బాధ్యులు కేసా హనుమంతురావు తెలిపారు. ఈమేరకు సంఘం తరపున దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వ్యాధులపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రామారావు

కామేపల్లి: సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రామారావు అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీపీ, షుగర్, కేన్సర్ వంటి వాటిపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శిరీష, జిల్లా ప్రోగామ్ ఆఫీసర్ దుర్గ, హెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, రాధాకృష్ణ, నరేంద్రనాయక్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ భూములను కాపాడాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం వెలుగుమట్ల శివారు గొల్లగూడెం గ్రామ పరిధిలో ఈద్గా, ఖబరస్తాన్‌తో పాటు పక్కనున్న సుమారు రూ.350 కోట్ల విలువ చేసే వక్ఫ్ భూమిని పరిరక్షించాలని మ్మం జిల్లా వక్ఫ్ భూముల పరిరక్షణ ముస్లిం మహిళల అడహక్ కమిటీ కార్యదర్శి నజ్నీన్, కోశాధికారి నస్రీన్ ఆరోపించారు. మంగళవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు జిల్లా అధికారుల అండతో వక్ఫ్ భూములను కాజేస్తున్నారని, దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నసీమా ఆర్పి, తరుణం ఫాతిమా, రఫియా, జరీనా, అనీఫా, ఆఫ్రిన్, మెహ్రాజ్, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు టై, బెల్టులు అందజేత

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెం ఎంపీపీఎస్ వెలుగుమట్ల పాఠశాలలో మంగళవారం కార్పొరేటర్ కూరాకుల వల్లరాజు సహకారంతో విద్యార్థులకు టైలు, బెల్టులు పంపిణీ చేశారు. స్కూల్ హెచ్‌ఎం అచ్చారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో షేక్ జానీమియా, ఉపాధ్యాయులు మంగమ్మ, షేక్ దస్తగిరి పాల్గొన్నారు.

## వికాస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ లావణ్య

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలో ఇటీవల నిర్వహించిన కరాటే టోర్నీలో వికాస్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని కరస్పాండెంట్ వై.లావణ్య తెలిపారు. వివిధ విభాగాల్లో పతకాలు సాధించిన టి.రిషిక్ శ్రీహాన్, ఐ.అభినయ్, గౌతమ్ విరాట్, తేజూ విరాట్, మోక్షశ్రీ, బి.తక్షిల్‌ను కరస్పాండెంట్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

## కరాటే స్కూల్ విద్యార్థులు..



పతకాలు సాధించిన విద్యార్థులతో మాస్టర్ సైదులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలో ఇటీవల జరిగిన సౌత్ ఇండియా స్థాయి కరాటే టోర్నీలో గోపతి సైదులు కరాటే స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. వివిధ విభాగాల్లో వి.మణికంఠ, ఏకాంష్, చందన, ప్రేమ్‌నాథ్, గాయత్రి, తన్మయి లక్ష్మి, మోనీషా, జైత్రశ్రీ, నాగా ఉమామహేశ్వరి, దీక్షిత్, ఏ.రేవన్స్, సందీప్, రామకృష్ణ, సూర్య, చరణ్ పతకాలు సాధించారని కరాటే మాస్టర్ గోపతి సైదులు తెలిపారు.

## 'హార్వెస్ట్' విద్యార్థులకు పతకాలు



ప్రతిభ చూపిన విద్యార్థులతో హార్వెస్ట్ యాజమాన్యం

ఖమ్మం స్పోర్ట్స్/ఖమ్మంసహకారనగర్: వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన టోర్నీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు మంగళవారం హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సీబీఎస్‌ఈ క్లస్టర్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో మోహిత్ కృష్ణ, ఎండీ అనాస్, ఎ.ఉజ్వల్ తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకం దక్కించుకున్నారన్నారు. అలాగే వీఎస్‌జీఎస్‌ఓ–2025 సింగపూర్‌లో ఫిబ్రవరిలో నిర్వహించిన అంతర్జాతీయ సైన్స్ కాంపిటీషన్స్‌లో జి.వెంకట్ ఉదయ్‌రెడ్డి గోల్డ్ మెడల్, వై.నిరుపమ్, జి.విహాన్ ప్రతీక్ సిల్వర్ మెడల్స్, మరో 18మంది బ్రాంజ్ మెడల్స్ అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థులతో పాటు కోచ్ అలీని అభినందించారు. సెప్ ఇన్‌చార్జ్ జి.ఉమామహేశ్వరరావు, కె.నాగరాజు పాల్గొన్నారు.